# హంసలను వేటాడొద్దు [18]

మూలం: బోరిస్ వాసిల్యెవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [18]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఆగస్టు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3317

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [18]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** అటవీ తనిఖీ జరగనుందనీ, అందులో యెగార్ కు కూడా భాగం ఉందనీ తెలిసి అతని తోడల్లుడు ఫ్యోడార్ ఇపటొవిచ్ కోపిస్తాడు. యెగార్ తనను ఇరికించాలనుకుంటున్నాడని తలపోస్తాడు. యెగార్, యూరీ పెట్రోవిచ్, నోనా, కోల్కాల బృందం అటవీ విహారం నుంచి తిరిగి వస్తుంది. యెగార్ వాళ్లను తమ ఇంటికి ఆహ్వానిస్తాడు. వాళ్లకు వండిపెట్టడానికి ఏమీ లేక, కొనడానికి డబ్బులు కనపడక, సాయం కోసం ఫ్యోడార్ ఇపటొవిచ్ దగ్గరకే వస్తాడు. ఫ్యోడార్ అవమానపరిచి వెళ్లగొడతాడు. దారిలో ఇదివరకూ యెగార్ కు పడవల రేవులో ఉద్యోగం ఇచ్చిన యకోవ్ ప్రొకొవిచ్ తారసపడతాడు. అతను అటవీ శాఖాధికారిని మంచి చేసుకునే ఉద్దేశంతో తానే వంటకు కావాల్సిన సరుకులన్నీ తెచ్చిస్తాడు. యెగార్ భార్య కూడా ఉద్యోగం నుంచి వచ్చి కలుస్తుంది. అందరూ కలిసి పాటలు పాడతారు. **ఇక చదవండి:—**

## 18

పొలుష్కిన్ ఇంటిలో ఏం పాటలు పాడారో ఊరు మొత్తం విన్నది. వాళ్ల ప్రతి చర్యను ఊళ్లోవాళ్లందరూ గమనిస్తూనే ఉన్నారు – అందరూ కలసి నోనా యురీవ్నాని ఆమె ఇంటి దగ్గర దిగబెట్టటం, ఆమె నవ్వులు, ప్రత్యేకంగా ఆమె కోసం యెగార్ పాడిన తనకి ఇష్టమైన పాట:

వీడ్కోలు కన్నా ప్రాణం విడవటం తేలిక,

మిత్రులరా మీకీ విషయం తెలుసు కదా!

యూరి పెట్రోవిచ్ తిరిగి వచ్చి ఆ రాత్రికి యెగార్ వాళ్లింట్లో బస చేసాడు.

కోల్కాని ఇంట్లో పడుకోమన్నారు, మగవాళ్లిద్దరూ కొట్టంలో పడుకున్నారు. వాళ్లు చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడుకుంటున్నారు కాబట్టి అక్కడ ఎవరూ లేరు.

“యెగార్, నీకు అడవి బాధ్యత అప్పగిస్తే తీసుకుంటావా?”

“నా తోడల్లుడు ఫ్యోడార్ ఇపటొవిచ్ సంగతేమిటి?”

"మీ ఫ్యొడార్ ఇపటొవిచ్ ఒక కుక్క. అంతేకాదు నీచుడు కూడా: ఆ విషయం నువ్వు కూడా చూసావు. నీ అంతరాత్మ ఏం చెపుతోంది? నిన్ను అటవీ అధికారిని చేస్తే అంతా కట్టుదిట్టం చేస్తావని ఆశించవచ్చా?"

ఆలోచనలో పడిన యెగార్ ఒక క్షణం ఏమీ మాట్లాడలేదు. ఒక వారం క్రితం ఇటువంటి ప్రతిపాదన వస్తే అంతా ఒక దారిలోకి తెస్తానని, కట్టుదిట్టం చేస్తానని, చెయ్యవలసిన పనులన్నీ చేస్తానని గొంతు బొంగురు పోయేవరకు తెగ వదరి ఉండేవాడు. కానీ ఇప్పుడు – ఎంత వింతగా ఉంది! ఇప్పుడంతగా ఉద్వేగానికి కూడా లోను కాలేదు. లోపల్లోపల ఏదైనా అనిపించినా దానిని బయటకు వ్యక్తపరచకుండా ప్రశాంతంగా ఆలోచించుకుని, బేరీజు వేసుకుని గంభీరంగా బదులిచ్చాడు, "మొత్తం కట్టుదిట్టం చేస్తానని ఆశించవచ్చు."

"ధన్యవాదాలు, యెగార్. మిగిలినవన్నీ రేపు మాట్లాడుకుందాం. ఇప్పుడిక నిద్రపో."

యూరి పెట్రోవిచ్ అటు తిరిగి నిద్రలోకి జారుకున్నాడు, కానీ యెగార్ చాలాసేపటిదాకా నిద్రపోలేదు. మంచి ఆలోచనలతో, ప్రశాంతమైన చిత్తంతో అడవిలో ఏ ఏ మంచి పనులు, అవసరమైన పనులు చెయ్యవచ్చో ఊహించుకుంటూ మెలకువగా ఉన్నాడు. అతడికి తెలియకుండానే ఈ ఆలోచనలు అతడి కలలతో కలసిపోయాయి. చిన్నపిల్లవాడి మాదిరి ఎటువంటి బాదరబందీలు, చింతలు లేకుండా గాఢ నిద్రపోయాడు.

అక్కడ ఫ్యొడార్ ఇపటొవిచ్ సరిగా నిద్రపట్టక ఇబ్బంది పడుతున్నాడు: అటూ, ఇటూ కదులుతాడు, గురకపెడతాడు, అదాటున లేచి కుక్క మొరుగుడు వింటాడు. పాల్మా తన గొలుసును గలగలలాడిస్తూ, దానిని లాగుతూ, చుట్టుపక్కలంతా మారుమోగేలా రాత్రంతా మొరుగుతూనే ఉంది. అది ముసలిది అయి ఉంటే దానిని చంపేసి ఉండేవాడిని అనుకున్నాడు ఫ్యొడార్ ఇపటొవిచ్. నిద్ర పట్టక అటూ, ఇటూ దొర్లుతున్న అతడికి కోపం పెరిగిపోసాగింది. ముసలిది కాకపోయినా వచ్చే వసంతంలో దానిని చంపెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయంతో అతడు తెల్లవారేదాకా ఏదో నిద్రపోయాననిపించాడు.

ఆకలి లేకుండానే నాస్తా చెయ్యటానికి కూర్చున్నాడు. ఉడకబెట్టిన గుడ్లను ఫోర్క్‌తో పొడుస్తూ, ధుమధుమలాడుతూ, మారిట్సాపై చిర్రుబుర్రులాడుతూ కూర్చున్నాడు. కిటికీలోంచి బయటకు చూసి ఫోర్క్ జారవిడిచినంత పని చేసాడు.

అతడి ఇంటి ముందు యెగార్ పొలుష్కిన్, కొత్త అటవీ వార్డెను యూరి పెట్రోవిచ్ చువలోవ్ ఉన్నారు. యెగార్ రాయిని చూపిస్తూ నవ్వుతున్నాడు.

"ఇవన్నీ తీసెయ్యి, మారిట్సా," అన్నాడు ఫ్యొడార్ ఇపటొవిచ్.

"అన్నీ ఏమిటి, ఫ్యొడార్?"

"ఇదంతా తీసెయ్యి!" అతడు ఉన్నట్టుండి మొరిగాడు. "బల్లమీద ఏమీ లేకుండా శుభ్రంచెయ్యి!"

మారిట్సా బల్లని శుభ్రంగా గుడ్డతో తుడిచే లోపలే తలుపు తెరుచుకుని వాళ్లిద్దరూ లోపలికి వచ్చారు. ఒకళ్లనొకళ్లు పలకరించుకున్నారు కానీ చేతులు కలపలేదు. ముందుగా యెగార్ చెయ్యి చాచటం సరికాదు కానీ చువలోవ్ చెయ్యి కలపకపోవటంతో ఫ్యొడార్ ఇపటొవిచ్ ఆత్మరక్షణలో పడిపోయాడు.

"నీ పొదరిల్లు బాగుంది," అన్నాడు యూరి పెట్రోవిచ్. "ముగ్గురికి కాస్త ఇరుకనిపించటంలేదూ?"

"ఇరుకా? మాకా? మా ఇంటిలో–" మారిట్సా మొదలుపెట్టబోయింది.

"ఆపు!" అరిచాడు ఇంటి యజమాని. "ఇక్కడినుంచి వెళ్లు. మేం ఏవో వ్యవహారాలు మాట్లాడుకోవాలి."

మారిట్సా పక్కగదిలో కొడుకు దగ్గరకి వెళ్లింది. ఓవా ఆమెవైపు సంజ్ఞ చేసి తాళంచెవి కంతకి చెవి ఆనించి కూర్చున్నాడు.

"కలపతో చేసిన గచ్చు. బాగుంది."

"అన్నింటికీ డబ్బు చెల్లించాను. అంతా చట్టప్రకారమే ఉంది."

"చట్టం సంగతి న్యాయస్థానాన్ని అడుగుదాం. ఈలోగా మన పనులు పూర్తి చేసుకుందాం: ఇతడు యెగార్ పొలుష్కిన్, కొత్త అటవీ అధికారి. నా సమక్షంలో అతడికి అన్ని కాగితాలు, పరికరాలు అప్పగించు."

"నాకు ఎటువంటి ఆదేశాలు అందలేదు."

"త్వరలోనే అవి నీకు అందుతాయి."

"అవి అందిన తర్వాతే అన్నీ అప్పగిస్తాను."

"నీ సమస్యను జటిలం చేసుకోవద్దు, బుర్యానోవ్. నువ్వు అప్పగించవలసినవి ఇప్పుడు అప్పగించు, నీకు ఆదేశాలు రేపు అందుతాయి. అర్థమయ్యిందా? కాబట్టి మొదలుపెట్టు. ఏమంటావు, యెగార్?"

"మొదలుపెడదాం," అన్నాడు యెగార్.

"సరే," పది మణుగుల బరువు వదులుతున్నట్టు అన్నాడు ఫ్యొడార్ ఇపటొవిచ్, "మొదలుపెడదాం."

వరసగా రెండు రోజులపాటు యెగార్ పరికరాలను తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. ప్రతి గొడ్డలి, ప్రతి కాడి పరీక్షించి చూసాడు. తరువాత యూరి పెట్రోవిచ్‌ని పట్టణంలో దిగబెట్టివచ్చాడు. తరువాత ఇప్పుడు తన అధీనంలో ఉన్న గుర్రాన్ని బండికి కట్టి కోల్కాతో కలిసి రిజర్వు అడవికి బయలుదేరాడు. పరిస్థితులు చక్కబెట్టటానికి.

"మళ్లీ ఎప్పుడు వస్తారు?" అడిగింది హారిటీనా.

"కొన్ని రోజులదాకా రాం," అతడు బదులిచ్చాడు. "అవసరమైన పనులన్నీ పూర్తి చేసేదాకా అక్కడే ఉంటాం."

కోల్కా కళ్లాలను అదిలించి, చల్‌చల్‌మనటంతో వాళ్లు పయమనయ్యారు. ఈలోగా పట్టణం చేరుకున్న యూరి పెట్రోవిచ్ ముందు రెండు ఆదేశాలమీద సంతకం చేసాడు: మొదటిది ఎఫ్. ఐ. బుర్యానోవ్‌ని ఉద్యోగంనుంచి తొలగిస్తూ, రెండవది వై. ఎస్. పొలుష్కిన్‌ని నియమిస్తూ. తరువాత ఫ్యొడార్ ఇపటొవిచ్ ఫోల్డరు తీసి తదుపరి చర్య చేపట్టవలసిందంటూ నేర పరిశోధన విభాగానికి నివేదిక రాసి పంపించాడు. తరువాత హోటలుకి వెళ్లి పెద్ద అక్షరాలతో ఉత్తరం రాయటానికి పూనుకున్నాడు:

"ప్రియమైన అమ్మా..."

ఆ ఉత్తరం పూర్తిచేసాక భృకుటి ముడివేసి, చాలాసేపు శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఆ తరువాత పెన్ను తీసుకుని రాయటానికి పూనుకున్నాడు, "ప్రియమైన మరీనా". ఒక క్షణం ఆలోచించి, దానిని కొట్టేసి వట్టి "మరీనా" అని రాసాడు. ఆ తరువాత అది కూడా కొట్టేసి, పెన్ను అవతల పడేశాడు. ఎంత ప్రయత్నించినా అతడి ఉద్దేశమేమిటో స్పష్టంగా తెలియటం లేదు, తను

చెయ్యాలనుకున్న వాదనలు బలంగా అనిపించటం లేదు, అసలు ఉత్తరం రాయాలో, వద్దో నిర్ణయించుకోలేకపోతున్నాడు. దాంతో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు.

ఈలోగా యెగార్ అడవిని బాగుచేసే పనిని సంతోషంగా చేపట్టాడు. ఖాళీ ప్రదేశాల్లో తుప్పలు తొలగించి, పడిపోయిన చెట్లు, ఎండిపోయిన కొమ్మలను పోగులుగా పేర్చాడు. కోల్కా, తనూ రోజూ ఇంటికి వెళ్లి రావలసిన పని లేకుండా తాత్కాలిక వసతిని నిర్మించాడు. అయినప్పటికీ అతడికి సమయం చాలటం లేదు. చేతినిండా పని ఉండటంతో అతడికి ఎంతో ఆనందంగా ఉంది. రోజుకి రెట్టింపు గంటలు ఉన్నా ఉదయం నుంచి సాయంత్రంవరకు ఏదో ఒకటి చేస్తూనే ఉండేవాడు. అతడు ఎంతో ఉత్సాహంగా పని చేసేవాడు. సాయంత్రమయ్యేసరికి అలిసిపోయి, ఒకరకమైన హాయైన అనుభూతిని పొందేవాడు. నిద్రపోతూ తను చాలా సంతోషంగా ఉన్నాననుకునేవాడు. నవ్వుతూ నిద్రపోయావాడు, నవ్వుతూ నిద్ర లేచేవాడు, పగలంతా నవ్వుతూనే ఉండేవాడు.

"అబ్బాయీ, నువ్వు కవిత్వం రాయగలవా?"

కోల్కా కోపంగా ముఖం పెట్టి బదులు ఇవ్వలేదు. యెగార్ వదిలిపెట్టకుండా మళ్లీ అడిగాడు. కోల్కా ముఖం ఇంకా కోపంగానే ఉంది కానీ, "అది నీకు సంబంధించిన విషయం కాదు," అంటూ బదులిచ్చాడు.

"కానీ ఇది చాలా ముఖ్యమైన విషయం," అంటూ యెగార్ వివరించాడు. "అడవి చుట్టూ గోడ కట్టలేం కాబట్టి పర్యాటకులు ఎలాగూ ఇక్కడికి వస్తారు. అంతటికీ, అన్నివేళలా నేను కాపలా ఉండలేను కదా. దీని వల్ల యూరి పెట్రోవిచ్‌కి కొత్త ఇబ్బందులు వస్తాయి. అయితే మనం పర్యాటకులకోసం సూచనలు రాయవచ్చు: ఏమి చెయ్యవచ్చో, ఏది చెయ్యకూడదో వివరిస్తాం. అయితే అడవిలో సూచనలు రాస్తే ఏం బాగుంటుంది, చెప్పు? కవితలు ఎందుకు రాయగూడదు అని నాకు అనిపిస్తోంది. క్రమశిక్షణ గురించి మంచి కవితలు. అవి చదవటానికి పర్యాటకులకు బాగుంటుంది, మనం నిశ్చింతగా ఉండవచ్చు."

"సరే," అంటూ కోల్కా నిట్టూర్చాడు. "ప్రయత్నిస్తాను."

స్థానిక అమెరికన్లు అయిన అంకా ప్రజల గురించి కవిత తరువాత కోల్కా ఒకే ఒక కవిత రాసాడు – అది పిలకజడలు ఉన్న అమ్మాయి గురించి, మరణం వరకు నిలిచే ప్రేమ గురించి. కానీ

దానివల్ల మంచి ఏమీ జరగలేదు. ఓల్యా కుజినా ఆ కవితను ఓవా బుర్యానోవ్‌కి చూపించింది, అందరి నవ్వుల మధ్య ఓవా దానిని పెద్దగా చదివి వినిపించాడు. ఆ తరువాత చాలా రోజులపాటు కోల్కాని ప్రేమికుడని పిలిచారు. దాంతో అతడు బాగా విచలితుడై సృజనాత్మక రచనలకు మంగళం పాడాలనుకున్నాడు.

"ఏదైనా ఉపయోగముంటుందంటే రాస్తాను. లేకపోతే అదంతా వట్టి చెత్త, నాన్నా."

"అలాగని నేననుకోను," ఆలోచనగా అన్నాడు యెగార్. "అలాగైతే మరి పాట ఏమిటి?"

"పాటలతో ఏమిటి? పర్యాటకుల ముందు మళ్లీ పాడబోవటం లేదుకదా?"

"లేదు," యెగార్ బదులిచ్చాడు. "అందుకు సమయం లేదు. సరే... నీకు తెలుసుగా... నువ్వైతే కవితలు రాయి."

ఆ మరునాడు కోల్కా నాన్నతోపాటు అడవిలోకి వెళ్లలేదు. చేపల గాలాన్ని కూడా పక్కన పెట్టేసాడు. రూళ్ల పుస్తకం, పెన్సిలు తీసుకుని కవితలు రాయటానికి కూర్చున్నాడు. కనుబొమ్మలు ముడివేస్తూ, పెదాలు కొరుక్కుంటూ రాయసాగాడు. అది చాలా కష్టమనిపించింది. కోల్కాకి చమటలు పట్టేసి, బాగా అలసిపోయాడు. అయితే సాయంత్రానికి తను పడిన శ్రమకి ఫలితం పొందాడు.

"సరే నాన్నా, విను." ప్రేరణకోసం కోల్కా సాయంత్రం ఆకాశంకేసి చూసి గొంతు సవరించుకుని చదవసాగాడు:

"పర్యాటకులూ, గమనించండి
మా మాటలు ఆలకించండి:
అడవి ప్రాంతమందు
మంటలు రగిలించవద్దు.
అటవీ అధికారి మీ కోసం
కట్టెలు కొట్టి ఉంచాడు,
అక్కడే మంట వెయ్యండి
ఆనందంగా గడపండి."

"ఊఁ," అన్నాడు యెగార్. "మంటల గురించి ఇది బాగుంది. లేకపోతే వాళ్లు అడవి మొత్తాన్నే తగలపెట్టేస్తారు. బాగుంది, కొడుకా, బాగా రాశావు."

"చీమల గురించి మరొకటి రాసాను," తండ్రి ప్రశంసతో ప్రోత్సాహం లభించిన కోల్కా చెప్పాడు. "అది ఇలాగుంటుంది:

నేను చీమను.

అటవీవాసిని,

కవుకుచెట్టు కింద

ఉంది నా నివాసం.

మీ దారిన మీరు

పక్కగా వెళ్లండి

అంతకంటే మిమ్మల్ని

కోరేదేదీ లేదండి."

"కవిత్వం అంటే అది!" మనస్ఫూర్తిగా అన్నాడు యెగార్. "ఇది నిజంగా బాగా వచ్చింది. చాలా చక్కగా రాసావు."

"మరికొన్ని రేపు రాస్తాను!" ఉత్సాహంతో అరిచాడు కోల్కా. "బహుశ ఈ పుస్తకాన్నంతా కవితలతో నింపుతానేమో!"

"అవి క్లుప్తంగా ఉండాలి," యెగార్ సూచించాడు. "క్లుప్తంగా, స్పష్టంగా ఉండాలి. చీమల కవిత మాదిరి."

"అలాగే రాస్తాను," కోల్కా ఆత్మవిశ్వాసంతో బదులిచ్చాడు. "చిన్నగా ఉండి స్పష్టంగా ఉంటాయి... "

మరునాడు కోల్కాని కవితలు రాయటానికి వదిలిపెట్టి యెగార్ ఇంటికి బయలుదేరాడు. అక్కడ కొన్ని చెక్కముక్కలు చిత్రిపట్టి, కలిపి మేకులు కొట్టి, వాటిని బండిలోకి వేసుకుని, సహనంతో వ్యవహరించే బక్కచిక్కిన ప్రభుత్వ గుర్రాన్ని కట్టుకుని సాయంత్రం నల్లచెరువు దగ్గరి తాత్కాలిక నివాసానికి బయలుదేరాడు.

ఆ ముసలి గుర్రం స్థిరంగా అడుగులు వేస్తూ నడుస్తోంది. యెగార్ ఓపిగ్గా దోమలను తోలుకుంటూ తన పరిధిలోని అడవిలో ఇంకేమేమి చెయ్యవచ్చో ఆలోచిస్తున్నాడు. ముసలి చెట్లను కట్టెపుల్లలకు, ఇళ్ల నిర్మాణానికి ఎవరూ కొట్టకుండా వాటిని గుర్తిస్తే బాగుంటుందేమో. ఈ రక్షిత ప్రదేశం గురించి తెలిసి వచ్చే – వాళ్లను ఆపటం ఇక సాధ్యం కాదు – పర్యాటకుల కోసం ఏమైనా కార్యక్రమాలు రూపొందిస్తే బాగుంటుందేమో. ఒక పెద్ద పుస్తకంలో అడవిలోని పశుపక్ష్యాదులన్నింటినీ నమోదు చేసి యూరి పెట్రోవిచ్‌కి ఇస్తే అతడు ఎంతగానో సంతోషిస్తాడు!

అడవి దారిలో సాఫీగా సాగుతున్న బండిలో కూర్చున్న యెగార్ ఫెళఫెళమంటూ విరుగుతున్న చెట్టు చప్పుడు వినిపించేంతవరకు తన ఆలోచనలలో మగ్నమై ఉన్నాడు. పెద్ద శబ్దం చేస్తూ చెట్టు నేలను తాకింది. ఆ తరువాత మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది. కళ్లెం లాగి బండిలోంచి దూకిన యెగార్ పరుగందదుకున్నాడు. హడావిడిగా పడుతున్న గొడ్డళ్ల చప్పుడు స్పష్టంగా వినిపిస్తుండటంతో ఆ దిశగా యెగార్ పరిగెత్తసాగాడు.

పడిపోయిన చెట్టు కొమ్మలను నరుకుతూ ఇద్దరు మనుషులు ఉన్నారు. కానీ ఎంతమంది ఉన్నది యెగార్ లెక్కపెట్టలేదు: ఇద్దరు ఉంటే ఇద్దరున్నారు; అయిదుగురుంటే అయిదుగురు ఉన్నారు. అతడి అధికారమేమిటో అతడికి తెలుసు, అందుకనే అతడు భయపడలేదు. వాళ్లు రోడ్డువైపుకి పారిపోకుండా అడ్డంగా పరిగెత్తుతూ ఒక్కసారిగా పొదలలోంచి బయటకు వచ్చి"కదలొద్దు! మీ పేర్లు?!" అంటూ అరిచాడు.

ఆ ఇద్దరూ వెనక్కి తిరిగారు: అది ఫిల్, క్రోక్. ఒక చెట్టు మొద్దు అడ్డుపడినట్టు యెగార్ ఒక్కసారిగా ఆగిపోయాడు.

"ఆహాఁ!" అన్నాడు ఫిల్. "సాయం చెయ్యటానికి ఒక మనిషి వచ్చాడు."

కానీ క్రోక్ ఎర్రబారిన కళ్లతో కోపంగా చూసాడు. అతడు ఏమీ మాట్లాడలేదు. "చాలా ఆశ్చర్యకరమైన ఘటన," ఫిల్ గతకాలపు స్నేహపు రోజుల మాదిరి నవ్వుతూ కొనసాగించాడు. "చారిత్రకమైన చర్చలని అంటాను. చెట్టు మొద్దు చుట్టూ శిఖరాగ్ర చర్చలు."

"ఈ చెట్టుని ఎందుకు కొట్టేసారు?" చెట్టు మొద్దుని కాలితో తడుతూ అమాయకంగా అడిగాడు యెగార్. "దానిని కొట్టెయ్యటానికి మీకు ఎవరు ఆదేశాలు ఇచ్చారు?"

"అప్పులు," ఫిల్ నిట్టూర్చాడు, కానీ అతడు తన నవ్వుని దాచలేదు.

“ఎందుకని అడుగుతున్నావా? నిధి కోసం. రేపు మూడు అరలీటరు ఖాళీ సీసాలు తీసుకుని వస్తాం: వాటిల్లో పెట్రోలు పోసి సామ్రాజ్యవాదపు యుద్ధట్యాంకులను తగలబెట్టమను.”

“ఎవరు ఆదేశాలు ఇచ్చారని అడిగాను,” కఠినంగా కనిపంచటానికి యెగార్ సాధ్యమైనంతగా తన భృకుటిని ముడివేశాడు. “మళ్లీ చిల్లర పనులకు దిగారా?”

“మూడు అరలీటరు సీసాలనుకో,” కళ్లు చికిలిస్తూ, పెదాలు చప్పరిస్తూ చెప్పాడు ఫిల్. “మాకు సహాయం చేస్తే నీకొక అర లీటరు ఇస్తాం.”

వింతగా ఊపిరి తీస్తున్న క్రోక్ వైపు చూసి యెగార్, “ఆ గొడ్డళ్లు ఇటివ్వండి,” అన్నాడు.

“నీకు గొడ్డళ్లు ఇవ్వం,” అన్నాడు ఫిల్. “అరలీటరు సీసా, లేకపోతే ముఖం మీద ఒక్క పోటు – ఏది కావాలో కోరుకో.”

“ఇక్కడి అడవికి అధికారిగా నేను –”

“ఇవ్వాల్టికి నా ఇంటిపేరు పూప్‌కిన్,” ఉన్నట్టుండి అన్నాడు క్రోక్. పీపా అడుగునుంచి వచ్చినట్టుంది అతడి గొంతు. “ఆ పేరు రాసుకో, పోలీసు నాయాలా.”

అతడు మౌనంగా ఉండిపోయాడు. అకస్మాత్తుగా అంతటా నిశ్శబ్దం ఆవహించటంతో తుమ్మెదల ఝుంకారం వినిపించసాగింది. ఆ ఝుంకారావాన్ని, ఆ మౌనాన్ని యెగార్ విన్నాడు. అతడు నిట్టూర్చాడు.

“పోలీసు ఏమిటి? ఆ మాట ఎందుకన్నావు?”

“నువ్విప్పుడు పెద్ద అధికారివి కదా?” బొంగురుగా అన్నాడు క్రోక్. “పెద్ద అధికారివి కాబట్టి ప్రజలమీద పెత్తనం చేస్తున్నావు కదూ? పేర్లు అడుగుతున్నావు కదూ? ఇది ఎప్పుడైనా చూసావా? దాని జిమ్మడ, చూసావా అంట?”

అలాగంటూ అతడు నాటకీయంగా పాతబడిపోయిన చొక్కాని మెడ దగ్గర పట్టుకుని సర్రున లాగాడు. మూకీ సినిమాలోని దృశ్యం మాదిరి చప్పుడు లేకుండా చిరిగిపోయిన ఆ చొక్కానుంచి చేతులు తీసి, వెనక్కి తిరిగి వంగి క్రోక్ చెమటతో తడిచి ఉన్న తన వీపుని యెగార్‌కి ప్రదర్శించాడు.

“ఇటువంటిది చూసావా?”

మురికిగా ఉన్న అతడి గూనిలాంటి వీపునిండా నల్లటి మచ్చలు ఉన్నాయి. వెన్నుపూస భాగంలో తప్పించి ఆ పక్కనుంచి ఈ పక్కదాకా ఆ మచ్చలు ఉన్నాయి.

"కళాత్మకంగా చిత్రించారు," వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు ఫిల్. "ఒక నిపుణుడి పనితనాన్ని గుర్తించగలుగుతావు."

"అందరూ తమ ముద్ర వేసారు, అందరూ!" అలాగే నిలబడి అరిచాడు క్రోక్. "పోలీసులు, ఎస్.ఎస్. దళం, జర్మన్ సిపాయిలు. నీకు కూడా వెయ్యాలని ఉందా? కానివ్వు! నీ ముద్రలు వెయ్యి!"

"అతడి భార్యా, పిల్లలతోపాటు అతడి ఇంటిని పోలీసులు తగలబెట్టారు," ప్రశాంతంగా పేర్కొన్నాడు ఫిల్. "నీ చొక్కా తిరిగి వేసుకో, మిత్రమా. అతడిముందు ఇదంతా ప్రదర్శించాల్సిన పనిలేదు."

క్రోక్ వినయంగా చొక్కా తిరిగి వేసుకుని, ముక్కు చీది, వాళ్లు అప్పుడే నరికిన కవుకు చెట్టు మొద్దు మీద కూర్చున్నాడు. ఉక్కబోతగా ఉన్నా అతడు వణుకుతూ ఉన్నాడు. ఎముకల్లాంటి వేళ్లతో గడ్డం చెయ్యని చెంపలను రుద్దుకుంటూ, పదేపదే "నేను బతికేది ఎప్పుడు? బతకటం మొదలుపెట్టేది ఎప్పుడు?" అనసాగాడు.

యెగార్‌కి తిరిగి తుమ్మెదల ఝుంకారం, మౌననాదం వినిపించసాగింది. తన హృదయంనుంచి భారమైన జాలి జారిపడేవరకు ఆగాడు. జ్వరంతో ఉన్నట్టు వణికిపోతున్న క్రోక్‌ని చూసాడు. యెగార్ గొంతుని ఏదో గడ్డ నొక్కేస్తున్నట్టు అనిపించటంతో అతడు గట్టిగా గుటకవేసాడు. అతడి చుబుకం కంపించసాగింది. ఆ గడ్డను అతడు దిగమింగి, మెల్లగా, "నేను చట్టానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాను."

"కానీ ఇది ఎవరికి తెలుస్తుంది?" అడిగాడు ఫిల్. "నీ అడవిలోని ప్రతి చెట్టూ లెక్కలో ఉందా?"

"ప్రభుత్వం లెక్కలో అన్నీ ఉన్నాయి," అన్నాడు యెగార్. "అందుకే మిమ్మల్ని అడవినుంచి బయటకు వెళ్లమంటున్నాను. మీరు చెట్లు నరకటం గురించి రేపు నివేదిక తయారు చేస్తాను. ఇప్పటికి ఆ గొడ్డళ్లు ఇటు ఇవ్వండి."

అతడు గొడ్డళ్లను అందుకోబోయాడు. రెప్పపాటులో ఫిల్ తనకి దగ్గరగా ఉన్న గొడ్డలిని తీసి ఎత్తి పట్టుకున్నాడు.

"నీకు గొడ్డలి కావాలన్నమాట? దాని రుచి వద్దా? చుట్టుపక్కల ఒక్క మనిషి కూడా లేదు, యెగార్. మేం మంచి మనుషులం కూడా కాదు... "

“అతడికి గొడ్డలి ఇవ్వు,” ఉన్నట్టుండి అన్నాడు క్రోక్. “నాకు వెలుతురు ఇష్టంలేదు. చీకటి అంటే ఇష్టం.”

చిరిగిన చొక్కా గుండీలు పెట్టుకోకుండానే అతడు పొదలగుండా పరుగుతియ్యటంతో అతడి వెనక అది గాలిపటంలా ఎగురుతూ కొమ్మలకు తగులుకోసాగింది.

“యెగార్, చీకటిలో తారసపడినప్పుడు మమ్మల్ని తప్పు పట్టవద్దు!”

గొడ్డలి కిందపడేసి వెళుతూ, వెళుతూ ఫిల్ ఆ మాటలు అన్నాడు. కొట్టేసిన చెట్లను యెగార్ గుర్తించి, గొడ్డళ్లు తీసుకుని నిద్రమత్తులో జోగుతున్న గుర్రం దగ్గరకు చేరుకున్నాడు. అతడు బండిలోకి ఎక్కి, ఉన్నట్టుండి ఆ ముసలి గుర్రాన్ని కొరడాతో ఝుళిపించి చెరువువైపు దౌడు తీయించాడు.

మంచి ప్రవర్తన మీద కవితలతో చెరువు దగ్గర కోల్కా అతడి కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ క్షణంలో యెగార్ దానిగురించి మాత్రమే ఆలోచించదలుచుకున్నాడు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com